కథానిక

# అతిరథులూ - మహారథులూ

"అమరశ్రీ"

మజ్జిగ అన్నం తింటున్న నాగభూషణం ఒకసారి ఆగిపోయాడు నోట్లో ముద్ద పెట్టుకోబోతూ. బజారున పోతున్న కారులోనుంచి సినిమా పాట వినిపిస్తోంది. మళ్ళా భోజనం కానిస్తున్నాడు త్వరగా ముగిద్దామన్న ఉద్దేశ్యంతో.

ఇంతలో సూర్యకాంతం ఆదుర్దాగా వంటింట్లోకి రావటంతో తలెత్తి చూశాడు.

"మనింటికేనండి" అన్నది వగరుస్తూ.

"ఎవరు?"

"ఎవరేమిటండీ? ఏమీ తెలియనట్లు!"

"అసలు ఏమిటి? ఎవరు? మనింటి కెవరొస్తారు, బడిపిల్లలు తప్ప."

"వాళ్ళండీ. ఎవరో అరవై ఏళ్ళ పార్టీ వాళ్ళట. అరుగో. రానే వచ్చారు. మిమ్మల్నే కేకేస్తున్నారు, త్వరగా కానియ్యండి. మాట్లాడుదురుగాని" అన్నది నాగభూషణం భార్య. భార్య త్వరపెడుతున్న దానికంటే రెట్టింపు వేగంగా భోజనం చేస్తున్నాడు నాగభూషణం.

ఇంతలో బయటనుంచి కేకలు, రెండుమూడు గొంతుకలు ఒక్కసారి వినిపించటంతో చివరి రెండు ముద్దలు ఒక్కసారి నోట్లో కుక్కుకున్నాడు నాగభూషణం. పొలబారి నోట్లో అన్నం వంటిల్లంతా విరజిమ్మినట్లయింది. దానిని సర్దుకునే ప్రయత్నంలో పడిపోయాడు నాగభూషణం.

"వస్తున్నారు. కూర్చోండి ఆ టేబిలుమీద" అన్నది సూర్యకాంతం బయటవాళ్ళ నుద్దేశించి.

"అయినా ఆదేమిటండీ ఆ తొందర? ఏం కొంపలంటుకుపోతున్నాయని ముక్కా నోటా గొట్టుకోవాలి? అసలే కరువురోజులు. అందులో పారవేయటాలు మరీనూ" అని విసుక్కుందా ఇల్లాలు, ఇల్లంతా పడిన మెతుకులు చూసి.

"ఉష్, పెద్దగా అరవకే! అటువంటి వాళ్లసలు మన యింటికేరారు. వచ్చినప్పుడన్నా మనం కాస్త వినయ విధేయతలతో ప్రవర్తించక పోతే ఎలా?" అంటూ కంచంలోనే చేయి కడుక్కున్నాడు.

"ఆదేమిటండీ కంచంలో..." అని నోరు నొక్కుకోబోయింది సూర్యకాంతం.

"మరెల్లా. అవ్వా గావాలి బువ్వా గావాలి అంటే" అంటూ కాళ్ళకు అంటుకున్న మెతుకులు శుభ్రంగా తుడుచుకొని కాళ్ళమీద చెంబెడు నీళ్ళు కుమ్మరించుకోకుండానే బయటకు దూసుకుబడ్డాడు నాగభూషణం.

"నమస్కారమండీ" అంటూ ఆ బయట కూర్చున్న వారిలో ఒకాయన చేయెత్తాడు. "నమస్కారం" అంటూనే నాగభూషణం "ఫరవాలేదు. కూర్చోండి" అంటూ ఆ లేవబోతూన్న ఆ ఖద్దరు లాల్చీ అజానుబాహుడిని వారించబోయాడు. నాగభూషణానికి కూడా చోటు చూపించారు. నాగభూషణం కూర్చుని మూతి తుడుచుకుంటూ నాలుగు పక్కలా చూశాడు. తన పక్కన కూర్చున్న అజానుబాహుడికి తప్ప తక్కిన వాళ్ళందరకూ బుజాల మీద రంగుల బాడ్జీలున్నవి. వాళ్ళందరూ వాలంటీర్లయి ఉంటారని నిర్ధారణ చేసుకున్నాడు వెంటనే నాగభూషణం. ఇంతలో వాళ్ళలోనుంచి కొంచెం నవనవలాడే యువకుడు ముందుకొచ్చాడు.

"వీరే మన సుబ్బరామయ్యగారు. వీరిని నేను మీకు పరిచయం చేయనక్కరలేదనుకోండి. అయినా..." అంటూ పాఠం వప్పగించేస్తున్నాడు. ఆ ముఖకవళికలన్నీ నాగభూషణానికి కరతలామలకాలు గనుక ఇట్టే గ్రహించి అడ్డు కట్టబోయాడు.

"వారు తెలియకపోవట మేమిటండీ-వారిలాంటివారు వారే" అంటున్నాడు నాగభూషణం

"…వీరె నాగభూషణంగారంటే. తెలుసుమా. మన ఊళ్ళో ఎంత కొద్ది కాలంలో స్కూలు మాస్టరుగా పేరు సంపాదించిన వాళ్ళలో మొట్టమొదటి వాడు" అని ఆపేద్దామా. వద్దా అన్న సందేహంలో పడ్డాడా వాలంటీరు.

"ఆ! దానికేంలెండి" అందామనుకున్నాడు నాగభూషణం. కాని నోట్లోనుంచి మాట బయటకు రాలేదు. తన నెప్పుడూ, యెవరూ పొగడరు. పొద్దున్న లేచినదగ్గరనుంచి రాత్రి పడుకోబోయేవరకూ తల వాచేలా దీవెనలు పైగా. కఠినంగా ఉన్నాడని స్కూలు పిల్లలు, డబ్బిచ్చినా తమ పిల్లలని పాసుచేయటం లేదని పెద్దవాళ్లు మున్నూటఅరవైరోజులూ దుంప తెగేలా తిట్టటం. తిండికి ముఖం వాచినవాడు అన్నం తిన్నట్లుగా, వాళ్లు పొగుడుతుంటే విని ఊరుకున్నాడు నాగభూషణం. ఉబ్బిపోయే స్వభావంమాత్రం కాదు.

"నాగభూషణంగారు తెలియక పోవట మేమిటి." అసలు కామందు అందుకున్నాడు. "వీరి నాన్నగారు నరసయ్యపంతులుగారి దగ్గరే మా నాన్నగారు కూడ చదువుకున్నారు" అంటూ చుట్టరికం కలిపాడు ఆజాను బాహుడు.

"ఓహో!" అంటూ చప్పరిస్తున్నాడు నాగభూషణం చేసేదిలేక.

"ఏదో నాకు చదువుగీత లేకగాని..." అనబోతున్నాడు ఆజాను బాహుడు.

"చదువెందుకండీ ఇది కావాలండీ."

అంటూ బుర్రకేసి చూపించాడు నాగ భూషణం, బడిపిల్లలకి ఆఫ్రికాలో సహారా ఎడారి చూపించే పద్ధతిలో.

కాస్సేపు అంతా నిశ్శబ్దం. వచ్చిన పనేమిటో వచ్చినవాళ్ళు చెప్పారు కారు. వచ్చినవాళ్ళు చెప్పకపోతారా అన్న ధీమాతో కూర్చున్నాడు నాగభూషణంకావు. ఆ వాలంటీరు మళ్ళా చలించాడు.

"మన సుబ్బరామయ్యగారు అసెంబ్లీ సభ్యత్వానికి పోటీచేస్తున్నారు మన ప్రాంతంనుంచి. మీ వోటు తప్పకుండా..." అంటూ చేతులు తిప్పబోయి అలవాటు ప్రకారం ఆగిపోయి, గొంతు సవరించుకొని "సుబ్బరామయ్యగారికే వేయాలని ప్రార్థిస్తున్నాము."

"తప్పకుండా." అన్నాడు నాగభూషణం. మనస్సులో కొంచెం సంతోషిస్తున్నాడు. తన ఇన్నేళ్ళ బడిపంతుల జీవితంలోనూ, తన నింతగా ఎవ్వరూ ఎన్నడూ ప్రాధేయ పడలేదు.

"అలా అంటేకాదు..." అని ఏదో అనబోయాడు, ఆ ఆజాను బాహుడు.

"మీ కెందుకు? వేస్తాగదండీ మీకే! మా రెండు వోట్లను గురించి మీరు భయపడ నక్కర్లేదు"

"మీ విషయంలో మా కెప్పుడూ భయం లేదు. మీ సహకారం కావాలి మాకు. మీరు ఎరుగున్నవాళ్ళకు సాధ్యమైనంతగా మీరు చెప్పాలి సుబ్బరామయ్యగారిని గురించీ, వారి విశాలభావాల్ని, జాతీయ కాంక్షనుగురించీ. మా అరవై ఏళ్ళ పార్టీ విషయం బాగా చదువుకున్న మీకు చెప్పవలసినపని లేదు. స్వాతంత్ర్య సమరంలో మా అరవై ఏళ్ళపార్టీ పాత్రమీకు తెలిసిందే. అటువంటి అరవైఏళ్ళ పార్టీ టిక్కెట్‌తో నిలబడే సుబ్బరామయ్యగారు... అందులో ఈ ప్రాంతాలలో వీరు చేసిన సేవ, హరిజన దేవాలయ ప్రవేశాలు, చిత్రపటావిష్కరణలు, కంచు, సిమెంటు వగైరా విగ్రహాల స్థాపనలు, వీరు చేసినన్ని ఈ ప్రాంతలలో మరెవరూ చేసివుండరని వేరే చెప్పనవసరం లేదు. అటువంటి వారికే చదువుకున్న మీరు తప్పకుండా సహకారమిస్తారని నమ్ముతున్నాం. అసలు సుబ్బరామయ్యగారిని చూసి మనం గర్వపడవలసిందిపోయి, సహకరించక పోతే..." అంటూన్నాడు వాలంటీరు.

"అయ్యో! ఎంత మాట." అని అందుకున్నాడు నాగభూషణం.

"పంతులుగారి వోటు మనకి ష్యూర్." అన్నాడు అందులో ఒక విద్యార్థి వాలంటీరు.

"వస్తాం. మర్చిపోకండి" అంటూ ఆ ఆజానుబాహుడు ఒక నమస్కార బాణం విసిరాడు నాగభూషణానికి. మెల్లగా మెట్లు దిగిపోతున్నాడు. పోతూనే వెనక్కి తిరిగాడు ఆ వాలంటీరు.

"మర్చిపోకండి!" అన్నాడు నవ్వుతూ ఆదారకంగా.

"నో! నో! నో!" అంటూ ముందుకు చెయ్యి జాపి కంగారుపడ్డాడు నాగభూషణం. వాళ్ళందరూ వెళ్ళిపోయారు. ద్వారంకేసి చూస్తూ ఒక్క క్షణం నిలబడిపోయాడు నాగభూషణం. వెంటనే వీథివాకిలివైపు నడిచాడు వాళ్ళెక్కడకు పోయారో చూదామని. వాళ్ళందరూ ప్రక్కవాళ్ళింట్లోకి దూరారు.

ఇంతసేపటినుంచీ ఆ పాటలు ఎక్కడినుంచి వస్తున్నాయా అని ఆశ్చర్యపోతున్నాడు నాగభూషణం. అక్కడొక టాక్సీ ఉన్నది. దాని నిండా కాగితాలంటించి ఉన్నయ్. మీ వోటు సుబ్బరామయ్యగారికే అన్నది తాటికాయంత అక్షరాలతో కనపిస్తోంది. క్రిందంతా ఆయన పుట్టుపూర్వోత్తరాలు. ఆయన దేశసేవా ధురీణత ఉన్నయ్. చదవబోయాడు వెధవపాట. చెవుల్లో జొరబడుతుంది. చదవటానికి వీల్లేకపోయింది. లోపలకొచ్చాడు కమ్మటి పాట వింటూనే.

"ఏమన్నారండీ" అంటూ సూర్యకాంతం ఎదురొచ్చి అడిగింది.

"ఏమంటారు? మీ వోటు మాకేయ్యమంటారు. ముందర నవ్వు భోజనం కానియ్. స్కూలుకు పోవాలి." అంటూ ఆపాట విందామనేఉద్దేశ్యంతో మంచంమీద నడుంవాల్చాడు. భోజనం చేయటానికి లోపలకు పోయింది సూర్యకాంతం. చక్కటి పాటలు వినిపిస్తున్నయ్. పిల్లలకు బుద్ధిచెప్పే నాగభూషణం చెవులు నిక్కబొడుచుకొని వింటున్నాడు.

"వినవే బాలా! నా ప్రేమగోల" పెద్దగా వినిపిస్తోంది. నాగభూషణానికి పాట బాగానే ఉన్నది గాని, ఈ వరసమాత్రం బాగా లేదు. నవ్వొచ్చింది. ఒక్కసారి చిన్నగా నవ్వి ఊరుకున్నాడు నాగభూషణం.

ఆ రికార్డు తీసి మరోటి పెట్టారు. మంచి సినిమా పాట. "బావలూ...మావలూ రంగేళి పిల్లంట బావా...సింగారి నేనంట మావా" మంచంమీద పడుకొని వింటున్నాడు నాగభూషణం. పాటమధ్యలో ఆపారు. కారు స్టార్టయింది. ఎవడో ఆ 'మైక్'లో ఉపన్యాసం ప్రారంభించాడు.

"అరవై యేళ్ళ నుంచి మా పార్టీ చేస్తున్న సేవ అమోఘమని చెప్పబోవటం అతిశయోక్తి గాదు. స్వాతంత్ర్యం వచ్చిన దగ్గరనుంచి మా పార్టీ చేసిన సేవ, ప్రజాజీవితాన్ని యెంత బాగు పరచింది మేము వేరేగా చెప్పనక్కర లేదు. మరో అయిదు సంవత్సరాల వ్యవధి ఇస్తే..." అంటూండగానే కారు దాటిపోయింది. తరువాత మాటలు నాగభూషణానికి వినిపించలేదు.

స్కూలుకుపోదామనే ఉద్దేశ్యంతో మంచం మీదినుంచి లేచాడు నాగభూషణం. లోపలకు పోయి బట్టలు మార్చుకోనే ప్రయత్నంలో పడ్డాడు. ఏవో నినాదాలు వినిపించినయ్. కొద్దికొద్దిగా సమీపిస్తున్నట్లుంది. మళ్ళా వాళ్ళు వస్తారేమో త్వరపడబోయాడు నాగభూషణం.

"ప్రపంచ కార్మికులారా!
ఏకం కండి!
విప్లవం వర్ధిల్లాలి!"

ఇత్యాది నినాదాలతో చెవులు చిల్లులు పడేలా అరుపులు. మళ్ళా అదేఅరుపు. "ప్రపంచ కార్మికులారా! ఏకం కండి! పార్టీ నిరంకుశత్వం నశించాలి." నినాదాలు సమీపిస్తున్నయ్. కారు మోత కూడ వినిపించింది. చిట్టచివరకు కారు ఆగిపోయింది. మళ్ళా వాళ్ళు కూడా వస్తారేమోనన్న ఆదుర్దాలో విడిచేసిన చొక్కా గుండీలు ఎక్కడో పెట్టాడు. కొత్త చొక్కా తొడుక్కొని గుండీలు పెట్టుకుందామంటే గుండీలు దొరకటంలేదు. వెతుకుతున్నాడు. వాళ్ళు రానేవచ్చారు. రక్షించారు. నినాదాలు మాత్రం మానేశారు, ఇంట్లో జొరబడుతూ.

"నాగభూషణం గారూ!" ఎవరో గట్టిగా పిలిచారు. పిలుపులోనే గట్టితనం కనిపించింది నాగభూషణానికి.

"వస్తున్నా కూర్చోండి" అంటూ, అటూ ఇటూ వెదికాడు గుండీలకోసం. దొరికే సూచనలు కనుపించలేదు. చేసేదిలేక పట్టి చేతితో పట్టుకొని వరండాలోకి వచ్చాడు. నాగభూషణం బయటకు రాగానే అందరూ నిలబడ్డారు బళ్ళో పిల్లలలాగా.

"ఫరవాలేదు. కూర్చోండి."

"ముందు మీరు కూర్చోండి."

నాగభూషణం కూర్చున్నాడు. వాళ్ళందరు 'పారా, పలుగూ' పార్టీ వాళ్ళని వాళ్ళ నినాదాలు వినగానే నిర్ధారణ చేసుకొన్నాడు. వాళ్ళను చూడగానే ఆ కాస్త అనుమానం కూడ తీరిపోయింది.

"బహుశా మేమెందుకు వచ్చామో మీరు తెలుసుకునుంటాము" అంటూ మొదలెట్టాడు, ఒక సోదరుడు.

"దానికేం?" అని ఏదో అనబోతున్నాడు నాగభూషణం. ఆగమన్నట్లుగా చూశాడో సోదరుడు. చేసేది లేక నోరు మూసుకున్నాడు నాగభూషణం.

"మా ఆశయం అరవై యేళ్ళ పార్టీని ఓడించటం. తరువాత వాళ్ళుచేసే అన్యాయాల్ని అరికట్టడం. పీడిత ప్రజల విముక్తికోసం పాటుబడే యే మానవుడైనా మాకు వోటు యిచ్చి తీరుతాడు. జీవితాన్ని చాలీచాలని గడ్డలా ధరించే కార్మికులు తదితర మధ్యతరగతి ప్రజల బాగోగులకోసం, మానవుడి ప్రాథమిక స్వాతంత్ర్య హక్కులకోసం మా పార్టీ పోరాడుతుంది. ఈ ప్రాంతంలో ప్రసాదరావు గారి పేరు వినని కార్మికుడు లేడు. ప్రసాదరావుగారి కార్యపరాయణత్వం, ఆయన ఖ్యాతిని గురించి చెప్పటం అనవసరం. అటువంటి వ్యక్తికి వోటు యివ్వటం యెటువంటిదో మీరు ఆలోచించుకోవచ్చు. ఈనాడు మీ టీచర్లు ఈ బాధలు పడుతున్నారంటే దీనికంతకూ కారణం ఈ అరవై యేళ్ళ పార్టీ అవకతవకలే. అటువంటి పార్టీని ఓడించి దేశంలో కరువునీ కాటకాన్ని నిర్మూలించటం మా లక్ష్యం కనుక మీ పూర్తి చేయూత మాకు కావాలి, తరువాత మీ ఇష్టం" అంటూ ఆ సోదరుడు మిగతా సోదరులవంక చూశాడు.

ఆ మిగతా సోదరులలో ఒకాయన అన్నాడు "మీ యిష్టం. మీరు ఆలోచించే వెయ్యండి. ఏది దేశాభ్యుదయం అయితే ఆ పనే చేయండి."

నాగభూషణరావుకి యేమనాలో తోచలేదు. అరవై యేళ్ళ పార్టీవాళ్ళే నయం ఒక్క విషయంలో మాత్రం. వాళ్ళు తననింత సందిగ్ధావస్థలో పెట్టలేదు.

"మీకే వేస్తాను."

"కాదు. మాకే వెయ్యమని మేము అడగటం లేదు. ఎవరిని గెలిపించటం దేశాభ్యుదయకరమని తోస్తే వారికే వెయ్యండి."

"తప్పకుండా మీకే వేస్తాను."

"వేస్తారుగదూ" అన్నాడు ఒకాయన.

"తప్పకుండా."

"నాగభూషణంగారిలాంటి వాళ్ళ అండ చాలు మనకి. వస్తాం సార్" అంటూ సెల్యూట్ చేసి వెళ్ళిపోయారు.

బ్రతుకుజీవుడా అని లోపలపడ్డాడు నాగభూషణం. తను స్కూలుకు పోవాలని ఎంత తొందర పడుతున్నాడో అంత ఆలస్యమవుతోంది. గుండీలు కనుపించినయ్ చివరకు వెతకగా వెతకగా. గుండీలు పెట్టుకొని వంటింటి వేపు నడిచాడు, వెళ్తున్నాని భార్యకు చెపుదామనే ఉద్దేశ్యంతో. సూర్యకాంతం భోజనం ముగించి కంచం కడిగే ప్రయత్నంలో ఉన్నది. ఇంతలో మళ్ళా గందరగోళం. కేకలు నినాదాలు వినిపించినయ్.

"నన్ను వ్వాళ బడికి పోనిచ్చేలా లేరు" అన్నాడు నాగభూషణం భార్యవంక చూస్తూ బిక్కమొహం వేసి.

"మీరు మరీ విడ్డూరం. వాళ్ళు మీకేం అడ్డు తగిలారు. మీదారిన మీరుపోక" అన్నది సూర్యకాంతం.

"చూస్తూనే ఉన్నావుగా ఇందాకటినుంచీ."

"మర్చిపొయ్యా. ఈ పార్టీ ఏమిటి."

"ఇది 'పారా పలుగూ' పార్టీ"

"వాళ్ళకేమని చెప్పారేం?"

"మీకే వేస్తామని చెప్పా."

"అరవై ఏళ్ళ పార్టీ వాళ్ళకి వేస్తామని చెప్పారు గదండీ."

"ఏంచెయ్యమంటావు మరి? అలా అనక పోతే వెనీఊళ్ళో బడి చెప్పుకో గలనా?"

"బాగానేఉంది" అంటూ సూర్యకాంతం దొడ్లోకి పోయింది కంచం కడగటానికి.

ఏవో కార్లు ఆగినట్లు చూశాడు నాగభూషణం. నినాదాలు మిన్నుముట్టుతున్నయ్.

క్షణంసేపు ఏంచేయాలో తోచక దొడ్డి వాకిలి వైపు చూస్తూ నిలబడ్డాడు నాగభూషణం.

"ప్రజాఫ్రంట్!
వర్ధిల్లాలి!"
అరవై ఏళ్ళ పార్టీ నిరంకుశత్వం
నశించాలి!"

అంతటితో నినాదాలు ఆగిపోయినయ్. వీధి మొదటి ఇల్లు నాగభూషణానిదే గాబట్టి తను జారుకోవటానికి గూడా వీలు లేకుండా పోయింది. వాళ్ళింకా రావటం లేదని నిర్ధారణ చేసుకొని త్వరగా దొడ్లోకి గెంతుకుంటూ పోయాడు.

"సూరీ! త్వరగా ఇంట్లోకిపో. వాళ్ళు కేకేస్తున్నట్లున్నారు. నేను లేనని చెప్పు." అన్నాడు బంతిపూల చెట్లచాటున నిలబడి.

సూర్యకాంతం నవ్వుకుంటూ లోపలికి పోయింది. ఇంతలోకే నాగభూషణంగారూ అని కేకలు సాగినాయ్. సూర్యకాంతం సర్దుకుంటూ నడిమింట్లోకి వచ్చి చూసింది.

"వారింట్లో లేరండి." అన్నదామె.

"ఎప్పుడొస్తారండీ?" అన్నాడొక భుజం మీద బాడ్జీగల మహాశయుడు.

"తెలియదండీ?"

"బడికెళ్ళారా?"

వెంటనే అబద్ధమాడటం చేతకాక సూర్యకాంతం కంగారు పడ్డది.

"అసలు ఊళ్ళో లేరండి"

"సరే. ఈ కాగితం తీసుకోండి." అంటూ "వోటరు మహాశయులకొక విజ్ఞప్తి"ని అందిచ్చాడు. సూర్యకాంతం మాట్లాడకుండా ముందుకువంగి తీసుకొన్నది.

"చూడండీ! మాళీశ్వర రావుగారంటే వీరే." అన్నాడా వాలంటీరు.

మాళీశ్వరరావుగారు చేయెత్తి ఆమెకు నమస్కారం చేయుటమూ, ఏంచేయాలో ఆమెకు తోచకపోవటమూ ఒకేసారి జరిగినయ్. వాలంటీరు మళ్ళా ఎత్తుకున్నాడు ఉపన్యాసం.

"అరవై ఏళ్ళపార్టీ చేస్తున్న అన్యాయం ఇంతంత కాదని చెప్పటానికి మా పార్టీ నిదర్శనం. మా పార్టీ రెండు నెలలక్రిందటే స్థాపించబడటం ఆ పార్టీ నిరంకుశత్వానికి చిహ్నం. ముఖ్యంగా మా పార్టీ స్థాపకులు మాళీశ్వరరావుగారికి అంటే వీరే—జరిగిన అపచారం ఇంతా అంతా కాదు. అటువంటి పార్టీని కూకటి వేళ్ళతో పెకలించటానికి మీలాంటి ప్రతిఒక్కరి సహకారం కావాలి. తప్పకుండా ఆ ఉద్దేశ్యం మీరు మనస్సులో ఉంచుకొని మీ వోటును సద్వినియోగం చేయాలని మా కోరిక." అంటూ ఆగిపోయాడు. అందరూ ఒకరిముఖం ఒకరు చూసుకున్నారు.

"చెప్తాలెండి వారికి" అన్నది సూర్యకాంతం.

"చెప్పటంకాదు. మీరుకూడ ఆలోచించి తీరాలి."

"మాకే వెయ్యమంటారు వారు కూడ బహుశః"

"అయితే నమస్కారాలు సిస్టర్! మీ పేరు తెలియదు. మరిచిపోవద్దని చెప్పండి." అన్నాడా వాలంటీరు గుక్క తిప్పుకోకుండా,

"వారిని మళ్ళా కలుసుకుంటాంలెండి. వస్తాము." అంటూ మాళీశ్వరరావు మళ్ళా నమస్కారంచేసి తిరగుముఖంపట్టాడు.

"మళ్ళా కలుసుకుంటాం" అనగానే దొడ్లో ఉన్న నాగభూషణం గుండె గతుక్కుమంది. సూర్యకాంతం పెరట్లోకి వచ్చి బంతి చెట్లచాటున నిలబడ్డ నాగభూషణానికి కాగితం ఇచ్చింది.

"నమస్కారం బాబూ! వీళ్ళకి ఆడా మగా భేదం లేదల్లే ఉంది. ఆడకూతురినని గమనం కూడా లేకుండా నా ఎదుట ఉపన్యాసం దంచేశాడు."

"అంతా ఎలక్షన్ స్టంటు." అన్నాడు నాగభూషణం చెట్లచాటునుంచి బయటకు వస్తూ.

"ఏమో మీ ఇష్టం. వాళ్ళ ఇష్టం. మీరు ముందింట్లో కూర్చోండి. నేను వంటింట్లో కూర్చుంటాను. ఎరగక వెళ్ళాను. మీరు లేరని చెప్పటానికి."

"మరేమిటనుకున్నావ్."

"ఏమీ అనుకోలేదు. కానీండి." అంది విసుగ్గా సూర్యకాంతం.

"నేను వాకిట్లోకి పోవటం ఎలాగ? ఇప్పుడే

వాళ్ళకు కనుపిస్తే నువ్వు చెప్పిందంతా అబద్ధమనుకుంటారు."

"మరేం చేయాలి?"

"ఒక పనిచేస్తాను. ఈ పూట బడికి సున్న చుట్టినట్లే. వీధితలుపు తాళంవేసి వస్తాను. పెరట్లోంచి వచ్చి పెరటితలుపు కూడా వేసి లోపల కూర్చుందాం." అన్నాడు నాగభూషణం తన తెలివికి తనే సంతోషిస్తూ.

"ఆదేదో మరి త్వరగా కానియ్యండి." అన్నది సూర్యకాంతం.

నాగభూషణం వెంటనే ఇంట్లోకి పోయి తాళంవేసే ప్రయత్నంలో ఉన్నాడు. ఏవో నినాదాలు, పాటలు, కేకలు, బొబ్బలు, అరుపులు వినిపిస్తున్నయ్. త్వరత్వరగా తాళంవేసి వచ్చి పెరటి తలుపుకూడవేసి ఇంట్లో దూరాడు. ఎలాగూ బడి సున్న చుట్టింది కదా అని కోటు విప్పుతున్నాడు.

ఇంతలో ఎవరో వచ్చారు. నాగభూషణాన్ని పిలిచారు. తలుపు కొట్టారు. చిట్టచివరికి తాళంచూసి చప్పరించి వెళ్ళిపోయారు.

"చూశావా?" అన్నాడు ధీమాగా నాగభూషణం.

"ఎందుకు చెప్పండి ఇదంతా."

"ఎందు కేమిటి. ఇదంతా ఓటర్లస్టంటు. ఎన్నడూ మనకి బడి మానే యోగ్యత లేదు. వాళ్ళధర్మమా అంటూ ఎగగొట్టటానికి సాకు దొరికింది."

"మీ కులాసా బాగానే ఉంది. అది సరే గాని- అసలు మన వోటు ఎవరికి వేద్దాం?" అన్నది చిన్నగా నవ్వుతూ.

"ఆఁ ..?"

"ఎవరు మంచివాళ్ళూ అని?" అన్నది సూర్యకాంతం, అమాయకంగా.

"ఎవరికివేస్తాం? అందరూ శ్రీ వైష్ణవులే. అప్పుడు ఆలోచిద్దాంలే. అబ్బా! నిద్ర వస్తోంది." అంటూ పట్టెమంచానికి శరీరం జేర్చాడు నాగభూషణం.

# తెలంగాణం వైపు

దాశరథి

జగత్తులో నేడు సగం
దగా తినుట మానుకుంది
బీద ప్రజ నేడు మొగం
తుడుచుకొని మేలుకుంది

ఇక నిద్దుర రాదు మనకు
ఇక చీకటి మాటలనకు.
మండుతున్న సూర్యుడు మన
మండలాన విచ్చెను తన
కాంతి నేత్రమును నేడు;
వెలుతురు నెవడడ్డ లేడు.

వెలుతురు లడ్డుట కొఱకై
పలుగోడలు పెట్టినారు
వెలుతురులను దాచుకొఱకు
పలుమేడలు కట్టినారు.

ధనం దాచ గలరు గాని
తేజస్సును దాచ గలర?
తెరలు దించ గలరు గాని
(మన) శిరస్సులను వంచ గలర?

తమ మంత్రం పార దింక
ఉచ్చు త్రెంచుకొనెను జింక;
ఇక స్వేచ్ఛా ప్రయాణము
అదిగో తెలంగాణము.